సాక్షి
వికారాబాద్
గురువారం । 31 । జూలై । 2025



ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

కొడంగల్ మండలం అన్నారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను నేషనల్ మానిటరింగ్ టీం సభ్యులు పరిశీలించారు. 8లో▸



వ్యాపారవేత్తలుగా ఎదగాలి

రైతులు వ్యాపార వేత్తలుగా ఎదగాలని తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త సుధాకర్‌చౌరట్ అన్నారు. 8లో▸



క్షయతో జాగ్రత్త

క్షయ వ్యాధిని సకాలంలో గుర్తించి మందులు వాడితే ఎలాంటి ముప్పు ఉండదని వైద్యులు అంటున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీలో అడ్మిషన్లు ప్రారంభం

తాండూరు టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు కోఆర్డినేటర్ నాగేశ్వర్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల చివరి తేదీ ఆగస్టు 13వ తేదీ వరకు ఉన్నట్లు చెప్పారు. డిగ్రీలో చేరదలచిన వారు ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఒకేషనల్, ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో ఏదో ఒకటి పూర్తి చేసిన వారు అర్హులేనన్నారు. వివరాల కోసం పట్టణంలోని పీపుల్స్ డిగ్రీ కళాశాలలోని అంబేడ్కర్ ఓపెన్ కేంద్రంలో సంప్రదించాలన్నారు.

మానవ అక్రమ రవాణాను అడ్డుకుందాం

ఎస్పీ నారాయణరెడ్డి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి తదితరులు

అనంతగిరి: మానవ అక్రమ రవాణాను నిలువరించేందుకు ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం సాధన ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ రమేష్‌తో కలిసి మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి నడుం బిగించాలన్నారు. బాలల అక్రమ రవాణా, పిల్లలపై లైంగిక దాడులకు వ్యతిరేకంగా సాధన సంస్థ పనిచేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సాధన ఎన్జీఓ ప్రతినిధులు నర్సింహులు, అంజయ్య, రోజా తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుకు మహిళ మృతి





వైష్ణవి (ఫైల్)

దుద్యాల్: పాము కాటు వేయడంతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని కుదురుమల్ల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొండగళ్ల వైష్ణవి(24) మంగళవారం రాత్రి భోజనం చేసి ఇంటి బయటికి వచ్చింది. తలుపు వద్ద ఉన్న పాము ఒక్కసారిగా కాటువేసింది. దీంతో వైష్ణవి గట్టిగా అరిచింది. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు నాగుపాము ఉండటం చూసి అదే కాటు వేసిందని గ్రహించి వైష్ణవిని కోస్గి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయింది. వైష్ణవికి భర్త అశోక్, 7 నెలల బాబు ఉన్నాడు. పామును స్థానికులు చంపేశారు.

ఆగస్టు 12లోగా దరఖాస్తు చేసుకోవాలి

అనంతగిరి: పరిగి పట్టణంలో ఖేలో ఇండియా ఖోఖో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నందున కోచ్‌లు కావాలని జిల్లా క్రీడల శాఖ అధికారి ఎంఏ సత్తార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన క్రీడాకారులు ఆగసు 12వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ల 98483 95708, 96766 38201లో సంప్రదించాలన్నారు.

పాదయాత్రను విజయవంతం చేద్దాం

పరిగి: నియోజకవర్గంలో గురువారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పాదయాత్ర ఉంటుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ముఖ్య నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. బుధవారం పరిగి పట్టణంలో పాదయాత్ర రూట్ మ్యాప్‌ను ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పరిగి నుంచే పాదయాత్రకు శ్రీకారం చుట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గురువారం ఉదయం తుంకుల్‌గడ్డలో శ్రమదాన కార్యక్రమం, ముఖ్య నాయకులతో పార్టీ పటిష్టత, వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చిస్తారని తెలిపారు.

ఒక్కటే యూనిఫాం..!

అదే తొడగాలి.. ఉతకాలి.. మళ్లీ వేసుకోవాలి

- స్కూళ్లు ప్రారంభమై రెండు నెలలు గడిచినా ఒక జతకే పరిమితం
- పంపిణీ చేస్తున్న దుస్తుల్లో నాణ్యతకు తిలోదకాలు
- తల్లిదండ్రులకు తప్పని ఆర్థిక భారం
- జిల్లాలో మొత్తం పాఠశాలలు 1,063
- విద్యార్థుల సంఖ్య 81,000



యూనిఫాం లేక సివిల్ డ్రెస్‌లో వచ్చిన విద్యార్థులు

వికారాబాద్: సర్కారు బడుల్లో ఎలాంటి సమస్యలు లేవని విద్యాశాఖ చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. నామమాత్రపు చర్యలు, సౌకర్యాలతో చేతులు దులుపుకొంటోంది. పాఠశాలలు పునఃప్రారంభమయ్యాక విద్యార్థులకు ఇవ్వాల్సిన యూనిఫారాల విషయంలో మీనమేశాలు లెక్కిస్తోంది. ఇప్పటి వరకు ఒక్క జత మాత్రమే ఇచ్చింది. రెండో జత ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తోంది. ఉన్న ఒక డ్రెస్‌ను వేసుకోవడం.. ఉతుక్కోవడం.. మళ్లీ అదే వేసుకోవాల్సి వస్తోంది. లేదంటే సివిల్ డ్రెస్‌లో పాఠశాలకు రావాల్సి ఉంటుంది. గతేడాది కూడా ఇదే తరహాలో జాప్యం చేసిన విద్యాశాఖ ఈ సారి కూడా అదే ధోరణి అవలంబిస్తోంది. సర్కారు బడి అయినా..ప్రైవేటు స్కూల్ అయినా తల్లిదండ్రులకు యూనిఫాం తిప్పలు తప్పడంలేదు.

1,62,000 దుస్తులు అవసరం

జిల్లాలో 1,063 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఇందులో ఒకటి నుంచి పదో తరగతి వరకు 81,000 మంది విద్యార్థులు ఉన్నారు. ఏటా ఒక్కో విద్యార్థికి రెండు జతలు చొప్పున యూనిఫాంలను ఉచితంగా అందజేస్తారు. వేసవి సెలవుల్లో డ్రెస్ కుట్టే ప్రక్రియను ప్రారంభిస్తారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున 1,62,000 దుస్తులు అవసరం కాగా ఇప్పటి వరకు ఒక జత మాత్రమే పాఠశాలలకు చేరింది. ఈ సారి క్లాత్ పంపిణీ చేసి స్థానికంగా ఉన్న మహిళా సంఘాలకు ఇచ్చి కుట్టిస్తున్నామని అధికారులు చెబుతుండగా.. బట్ట పంపిణీలో ఆలస్యం చేయడంతోనే ఈ సమస్య ఉత్పన్నమవుతున్నట్లు తెలిసింది. మహిళా సంఘాల సభ్యులకు ఇవ్వాల్సిన కూలి డబ్బులు సైతం సకాలంలో చెల్లించలేదని ఇది కూడా ఆలస్యానికి ఒక కారణమైనట్లు తెలిసింది.

ఎవరికి వారే యమునా తీరే..

యూనిఫాంల విషయంలో ఉపాధ్యాయులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఆయా స్కూళ్లకు డ్రెస్‌లు ఇచ్చినా వాటిని వాడకుండా వింత ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఒక్కో పాఠశాలకు ఒక్కో యూనిఫాం ఉంటోంది. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు డ్రెస్ కోడ్‌ను అమలు చేస్తున్నారు. అయితే ఐదారు సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా డ్రెస్ కోడ్ పెట్టారు. పంపిణీ చేస్తున్న దుస్తులు సైతం ఒక్కో సంవత్సరం ఒక్కోరంగులో ఉంటున్నాయి. నాణ్యత లేని వాటిని పంపిణీ చేస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులు ఆకర్షణీయంగా ఉండే వేరే రంగుల దుస్తులను యూనిఫాంగా పెట్టుకుంటున్నారు. దీంతో ఒక్కో ప్రభుత్వ పాఠశాలకు ఒక్కో రకం దుస్తులు ఉంటున్నాయి. ఈ విధానం తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతోంది. ఈ విషయమై డీఈఓ రేణుకాదేవిని వివరణ కోరగా యూనిఫాం కుట్టడంలో ఆలస్యం వల్ల అన్ని పాఠశాలలకు రెండు జతల డ్రెస్‌లు పంపిణీ కాలేదని, త్వరలో అందేలా చూస్తామని తెలిపారు.



మర్పల్లి: కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్ రెడ్డి

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

మర్పల్లి: స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. బుధవారం మండలంలోని పట్లూరు గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ప్రజలు విసుగు చెందారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెద్దింటి నవీన్, దిశా కమిటీ సభ్యుడు వడ్ల నందు, జిల్లా కార్యదర్శి మల్లేష్ యాదవ్, మండల, స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జ్ యాదవ్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్లను వెంటనే బాగు చేయాలి

అనంతగిరి: జిల్లాలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారిందని, అధికారులు వెంటనే స్పందించి వాటిని బాగు చేయించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్‌అండ్‌బీ పరిధిలోని రోడ్ల దుస్థితిపై బుధవారం వికారాబాద్‌లోని ఆ శాఖ ఈఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్ – తాండూరు, పరిగి, తంగడిపల్లి, మోమిన్‌పేట తదితర మార్గాలన్నీ అధ్వానంగా మారాయన్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. రోడ్డు పనుల్లో నాణ్యత పాటించకపోవడం వల్ల వేసిన రెండు మూడేళ్లకే దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మరింత పాడయ్యాయని తెలిపారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తాండూరు సమీపంలోని కాగ్నా బ్రిడ్జిపై గుంతలు పడ్డాయని తెలిపారు. వెంటనే మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జ్ నవీన్‌కుమార్, జిల్లా కార్యదర్శి రాజు, పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ అమరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు భుజంగరెడ్డి, మోహన్‌రెడ్డి, శివరాజు, సుధాకర్ ఆచారి, మల్లేశం, రవీందర్‌రెడ్డి, శివరాజ్‌గౌడ్, ఆశిరెడ్డి, మహేష్, గోపాల్, రాజు, సురేందర్‌రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్

పోరాటమే సీపీఐ కర్తవ్యం

- పార్టీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్
- తాండూరులో పట్టణ, మండల నాయకులతో సమావేశం

తాండూరు టౌన్: ప్రజా సమస్యలపై పోరాటం చేయడమే సీపీఐ పార్టీ ప్రధాన కర్తవ్యమని జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ పేర్కొన్నారు. బుధవారం తాండూరులో పట్టణ, మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏళ్ల తరబడిగా తాండూరులో నెలకొన్న సమస్యలపై పోరాటం చేస్తున్న పార్టీ సీపీఐ అన్నారు. పార్టీలకు అతీతంగా ఎవరికి అన్యాయం జరిగినా మేమున్నామంటూ ఆందోళన చేసిన ఘనత సీపీఐదే అన్నారు. సాటి మనిషికి జరుగుతున్న అన్యాయాన్ని తెలుసుకుని, వారికి అండగా నిలిచినప్పుడే కమ్యూనిస్టు పార్టీలో తీసుకున్న సభ్యత్వానికి విలువ ఉంటుందన్నారు. ప్రతి ఉద్యమానికి ఇక్కడి ప్రాంత ప్రజల, ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలు మరువలేనివన్నారు. ప్రజలను చైతన్యవంతులుగా చేస్తూ, ప్రజల పక్షాన నిలబడే బాధ్యత మనపై ఉందన్నారు.

నూతన కార్యవర్గం

అనంతరం తాండురు పట్టణ, మండల నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. పట్టణ కార్యదర్శిగా మునీర్ అహ్మద్, సభ్యులుగా ఇమ్రాన్, నసీమా బేగం, జగదాంబ, విజయ్, రాజేందర్‌ను నియమించారు, మండల కార్యదర్శిగా యాదప్ప, సహాయ కార్యదర్శిగా రాజు, కార్యవర్గ సభ్యులుగా దస్తప్ప, లక్ష్మణ్, చంద్రమ్మ, శివ, గోపాల్ రెడ్డిని నియమించారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రవీందర్, నాయకులు చాకలి యాదప్ప, మినాజుద్దీన్, అశోక్, విజయలక్ష్మి, దేవి పాల్గొన్నారు.

కంది బోర్డు ఏర్పాటయ్యేనా?



కొడంగల్ శివారులో సాగు చేసిన కంది పంట

- తాండూరు కందికి డిమాండ్
- నల్ల రేగడి భూముల్లో అధిక దిగుబడి

కొడంగల్: జిల్లాలోని కొడంగల్, తాండూరు నియోజకవర్గాల్లో కంది పంటను అధికంగా సాగు చేస్తున్నారు. ఈ ప్రాంత నల్ల రేగడి భూములు కంది సాగుకు అనుకూలం. అధిక దిగుబడి వస్తుంది. అంతేకాకుండా ఇక్కడి కంది పప్పునకు ప్రత్యేకత ఉంది. చూడడానికి పెద్ద సైజులో కనిపిస్తుంది. వండిన తర్వాత రుచిగా ఉంటుంది. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ పండించిన కంది పప్పును తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. భౌగోళిక గుర్తింపు కూడా లభించింది. భౌగోళిక గుర్తింపు అంటే నాణ్యత, ప్రోటీన్లు, విటమిన్లు కలిగిన ఈ కంది పప్పు ఈ ప్రాంతంలోనే పండుతుంది. తాండూరు కంది పప్పులో ప్రోటీన్లు 24 శాతం ఉంటాయి. మిగిలిన పప్పులతో పోలిస్తే ఇది మూడింతలు అధికం. రుచిలో ఈ పప్పుకు మరే ఇతర పప్పులు సాటిరావు. కుక్కర్ అవసరం లేకుండా త్వరగా ఉడుకుతుంది. కంది పప్పు ఉడికే సమయంలో కమ్మటి వాసన వస్తుంది. తాండూరు కందిపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పలు పరిశోధనలు చేశారు. భౌగోళిక గుర్తింపు రావడంతో తాండూరు కందికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత ప్రాచుర్యం లభించింది.

50 వేల హెక్టార్లలో..

జిల్లా వ్యాప్తంగా సుమారు 50 వేల హెక్టార్లలో కంది పంటను సాగు చేశారు. ప్రతి ఏటా అధిక మొత్తంలో కందులను పండిస్తున్నారు. మంచి డిమాండ్ ఉండటంతోపాటు గిట్టుబాటు ధర లభిస్తోంది. చాలా కాలంగా కంది బోర్డు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. కంది బోర్డు ఏర్పాటు చేస్తే తమకు ఎంతో మేలు జరుగుతుందని రైతులు భావిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని కంది బోర్డు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

సత్వరం పూర్తి చేయండి

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోగ్థు
- మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనుల ఆలస్యంపై సీరియస్



మెడికల్ కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న క్రిస్టినా, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులు

తాండూరు: సమయం లేదు.. వారం రోజుల వ్యవధిలో మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోగ్థు అధికారులను ఆదేశించారు. త్వరలో తరగతులు ప్రారంభం కానున్నందున అన్ని సదుపాయాలు అందుబాటులోకి తేవాలని సూచించారు. తాండూరు పట్టణ శివారులో నర్సింగ్ కళాశాల కోసం నిర్మిస్తున్న భవనంలో కొడంగల్‌కు సంబంధించిన మెడికల్ కళాశాలలను తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్నారు. ఈ భవనాన్ని ఆమె బుధవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్, రాష్ట్ర, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. వైద్య విద్యార్థుల కోసం ప్రాక్టికల్స్ సామగ్రిని సమకూర్చారు. కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతర సాంకేతిక పరికరాలు వెంటనే ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం బిల్డింగ్ మ్యాప్‌ను పరిశీలించి అన్ని గదులకు నంబర్లు వేయాలన్నారు. హాస్టల్ భవన నిర్మాణ పనులు ఆలస్యం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయం లేదని పదేపదే చెబుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే భవనాన్ని అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కళాశాల ఎదుట సీసీ రోడ్డు, ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించాలన్నారు. కళాశాల చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. మంచి నీరు, విద్యుత్ సరఫరాపై ఆరా తీశారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.


ఆస్పత్రుల సందర్శన

తాండూరులోని మాతాశిశు, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రులను క్రిస్టినా జెడ్ చోగ్థు సందర్శించి రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి తనిఖీ చేశారు. సదుపాయాలపై ఆరా తీశారు. మాతాశిశు కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచించారు.

సమయపాలన పాటించాలి

వైద్యులు సమయపాలన పాటించాలని క్రిస్టినా ఆదేశించారు. రోగుల సంఖ్య పెరుగుతున్నందున అందుకు తగ్గట్లుగా వైద్యం అందేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వార్డులు అపరిశుభ్రంగా ఉండటంతో అసహనానికి గురయ్యారు. ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. మందుల నిల్వపై ఆరా తీశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఎంఈ నరేంద్రకుమార్, ఎండీ ఫణీంద్ర కుమార్‌రెడ్డి, డీఎంఈ ప్రత్యేకాధికారి విమల థామస్, డీఎంహెచ్‌ఓ లలితాదేవి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్, కొడంగల్ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ అనంత్, జీజీహెచ్ మాలతి, ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీత, మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ బి.రాజు, వైస్ ప్రిన్సిపాల్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని పండుగలా మారుస్తాం



బాధ్యతలు తీసుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

పరిగి: వ్యవసాయం అంటే దండుగ కాదు.. పండుగలా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆత్మ కమిటీ నియోజకవర్గ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డితో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వమన్నారు. అన్నదాతల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం రైతుల ను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆత్మ కమిటీలను మళ్లీ ప్రారంభించి అన్నదాతలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. పరిగి పట్టణంలో ఆత్మ కమిటీ నూతన భవన నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు.

నేడు గురుకులంలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

బడంగ్‌పేట్: రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట మండలంలోని నాదర్‌గుల్‌లో కొనసాగుతున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో ఇంటర్ ఫస్టియర్‌కు సంబంధించి గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కాలేజీలో సంప్రదించాలని సూచించారు. టెన్త్ మెమో, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, నాలుగు పాస్ పోర్టుసైజు ఫొటోలతో రావాలని సూచించారు.

నీ బిడ్డను నేనే ఎత్తుకెళ్లా!

- బాలిక తండ్రికి యువకుడి ఫోన్
- పీఎస్‌లో ఫిర్యాదు చేసిన బాధిత కుటుంబ సభ్యులు
- పోలీసులు పట్టించుకోవడం లేదని ఆవేదన



నిందితుడు రాథోడ్ రాహుల్

బషీరాబాద్: ఓ బాలికకు మాయమాటలు చెప్పిన యువకుడు ఆమెను కిడ్నాప్ చేశాడు. అంతటితో ఆగకుండా 'నీ బిడ్డను నేనే ఎత్తుకెళ్లా.. మా కోసం వెతకొద్దు' అని నేరుగా బాలిక తండ్రికే ఫోన్ చేశాడు. ఈ ఘటన బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగు చూసింది. బాధిత తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాపూర్(బి) గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలిక బషీరాబాద్‌లో 7వ తరగతి పూర్తి చేసి, కొద్ది రోజులుగా ఇంటి పట్టునే ఉంటోంది. ఈ నెల 23న పెద్దేముల్ మండలం పాషాపూర్ తండాకు చెందిన రాథోడ్ సీతారాం, శాంతిబాయి దంపతుల కుమారుడు రాథోడ్ రాహుల్(22) అల్లాపూర్‌కు వచ్చి బాలికను బైక్‌పై తీసుకెళ్లాడు. అదే రోజు సాయంత్రం ఆమె తండ్రికి కాల్ చేసి నీ బిడ్డ నా దగ్గరే ఉందని చెప్పాడు. రెండు రోజుల పాటు ఫోన్ చేసినా కలవకపోవడంతో బాలిక తండ్రి ఈ నెల 26న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన కూతుర్ని రాహుల్ అనే యువకుడు కిడ్నాప్ చేశాడని, ఫిర్యాదు చేసి నాలుగు రోజులవుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించాడు. అయితే సదరు యువకుడిని కాపాడేందుకు అధికార పార్టీకి చెందిన నాయకులు పోలీసులపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఇదే విషయమై ఎస్ఐ నుమాన్ అలీని వివరణ కోరగా.. నాలుగు రోజుల క్రితం బాలిక మిస్సింగ్‌పై ఫిర్యాదు అందిందని తెలిపారు. ఇరు కుటుంబాలను పిలిచి మాట్లాడుతామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



ఇందిరమ్మ ఇంటి వద్ద అధికారులు

కొడంగల్: మండల పరిధిలోని అన్నారం గ్రామంలో నేషనల్ మానిటరింగ్ టీం సభ్యులు జోసెఫ్, వినోద్‌లు బుధవారం పర్యటించారు. గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన సంక్షేమ పథకాల పురోగతిని పరిశీలించారు. నర్సరీ, ఇందిరమ్మ ఇండ్లు, ఆసరా పింఛన్ల పంపిణీ తీరును గమనించారు. సీసీ రోడ్ల నిర్మాణం, ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉషశ్రీ, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, ఏపీఓ రాములు, పంచాయతీ కార్యదర్శి బలరంగాచారి తదితరులు పాల్గొన్నారు.

ఠాణా నిర్మాణ పనుల్లో వేగం పెంచండి



పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

దుద్యాల్: దుద్యాల్ గేట్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ పనులను పరిగి డీఎస్పీ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. పనులు వేగంగా సాగించాలని, త్వరగా పోలీస్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అక్కడి నుంచి నేరుగా దుద్యాల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసుల పని తీరును పరిశీలించారు. కేసుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యవేక్షణ చేస్తుండాలని ఎస్‌ఐ యాదగిరికి సూచనలు చేశారు. డీఎస్పీ వెంట కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మాకు న్యాయం చేయండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట పొన్నగుట్టతండావాసులు

శంకర్‌పల్లి: ప్రభుత్వం తమకి వ్యవసాయం చేసుకోడానికి ఇచ్చిన భూమిని ఓ వ్యక్తి ఆక్రమిస్తున్నారని బాధితులు బుధవారం శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్‌ని కలిసి వినతిపత్రం అందించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని పొన్నగుట్టతండాలో సర్వే నంబరు 96/130లో 4ఎకరాల భూమిని వ్యవసాయం చేసుకునేందుకు గాను అప్పటి ప్రభుత్వం 1967లో వాల్య అనే వ్యక్తికి ఇచ్చింది. అప్పటి నుంచి ఆయన వ్యవసాయం చేసుకుంటూ ఉండగా, కొన్నేళ్ల క్రితం వాల్య మృతి చెందాడు. అప్పటి నుంచి ఆయన నలుగురు కుమారులు కిషన్, శంకర్, రాంసింగ్, అమియాలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొన్ని నెలల క్రితం మోకిల తండాకు చెందిన ఓ వ్యక్తి వారిని భయ భ్రాంతులకు గురి చేస్తూ భూమిని ఆక్రమించాడు. దీంతో అప్పటి నుంచి బాధితులు న్యాయం చేయాలంటూ తహసీల్దార్, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. సమస్యపై తహసీల్దార్ సురేందర్ వివరణ కోరగా.. సంబంధిత అధికారులను వెళ్లి పరిశీలించాలని సూచించినట్లు స్పష్టం చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



శివకుమార్ (ఫైల్)

పహాడీషరీఫ్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరామ కాలనీకి చెందిన వెంకటేష్ కుమారుడు శివకుమార్(30) భార్య మాధవి ఈ నెల 7న ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి శివకుమార్ మనోవేదనతో ఉన్నాడు. ఈ నెల 29న డ్యూటీకి వెళ్లిన అతడు మధ్యాహ్నం బంధువుకు ఫోన్ చేసి 'అమ్మ, నాన్న జాగ్రత్త.. తమ్ముడికి గైడెన్స్ ఇవ్వు' అంటూ కాల్ చేసి అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. అతని ఆచూకీ కోసం స్థానికంగా గాలించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం వెంకటేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇతని ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు

షాబాద్: మండల పరిధిలోని బోడంపహాడ్, మన్‌మర్రి గ్రామాలకు వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బురదమయంగా మారింది. దీంతో రైతులు, వాహనదారులు అవస్థలు పడుతూ ప్రయాణిస్తున్నారు. పాలకులు స్పందించి రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.

శాస్త్రీయ విధానమే మేలు

- గొర్రెల సంరక్షణ అవసరం
- రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి





షాబాద్: తిమ్మారెడ్డిగూడలో గొర్రెల మంద

షాబాద్: గొర్రెల పెంపకం లాభాదాయకంగా ఉండాలంటే పిల్లలు పుట్టిన వెంటనే శాస్త్రీయ పద్ధతిలో యాజమాన్య పోషణ, ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలి. సమగ్ర విధానాలతో జీవాలను కాపాడుకోవచ్చని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి గొర్రెల కాపరులకు సూచించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గొర్రె పిల్ల పుట్టిన వెంటనే ముక్కు, నోరు మీద ఉండే పొర తొలగించి పొడి గుడ్డతో తుడవాలి. బొడ్డుదానంతట అదే విడిపోకపోతే రెండు అంగుళాలు కత్తిరించి అయోడిన్‌తో శుభ్ర పరచాలి. పుట్టిన గంటసేపు ముర్రుపాలు తాగించాలి. ముర్రుపాలలో ఏ, డీ, ఈ విటమిన్‌లు వ్యాధి నిరోధక శక్తినిచ్చే యాంటీబాడీలు అధికంగా ఉంటాయి. పిల్లలను పొడిగా ఉంచి వెలుతురు, గాలి బాగా ప్రసరించే ప్రాంతాల్లో కట్టి వేయాలి. గొర్రె పిల్లలను చలి నుంచి కాపాడాలి.

పాటించాల్సిన పద్ధతి

పాలు మరిచే వరకు(దాదాపు 3 నెలలు) గొర్రె పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పిల్లలను తల్లితో పాటు మందకు పంపకుండా కొట్టంలోనే ఉంచి పెంచాలి. తల్లితోపాటు పంపితే శక్తి వృథా అయి పెరుగుదల తగ్గుతుంది. ఇంటి దగ్గర పెట్టిన పిల్లలను గాలి, వెలుతురు బాగా ఉండే కొట్టంలో తడకలు కట్టి అందులో వదలాలి. వరిగడ్డి పక్కలో వేసితే వెచ్చగా ఉండి పిల్లలు మట్టి తినకుండా చూడవచ్చు.

గొర్రె పిల్లల పోషణ

గొర్రె పిల్లల్లో పెరుగుదల మొదటి మూడు నెలల్లో ఎక్కువ ఉంటుంది. ఇలా అధిక పెరుగుదలున్నా గొర్రె పిల్లలే ముందు ఆరోగ్యంగా ఉండి ఎక్కువ బరువు తూగి లాభాలు చేకూర్చుతాయి. పాలు మరిచే వయసు వరకు తల్లిపాలకు అదనంగా పోషనివ్వాలి. చిన్న గొర్రెలను నిదానంగా ఆకు తింటూ అవి జీర్ణించుకోవడానికి అలవాటు పడతాయి.

ఆరోగ్య పరిరక్షణ

తల్లి గొర్రెలను మేతకు పంపిన తర్వాత వేపాకు లేదా దాణా వేసి అన్ని పిల్లల ఆరోగ్యంగా ఉన్నదీ లేనిది చూడాలి. మూడు నెలల వయసు దాటిన తర్వాతా మొదటిసారి నట్టల నివారణ మందు తాపాలి. ఇది ఊపిరితిత్తుల్లోకి పోకుండా జాగ్రత్తగా తాపాలి. దీని తర్వాత 10-15 రోజుల వ్యవధిలో చిటుకువ్యాధి టీకా మందు ఇవ్వాలి. మరో 15 రోజులకు రెండో డోసు టీకా ఇవ్వాల్సి ఉంటుంది.

రైతులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్‌చౌరట్

తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్‌చౌరట్

తాండూరు: రైతులు వ్యాపార వేత్తలుగా ఎదగాలని, దీని కోసం ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందజేస్తోందని తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్‌చౌరట్ పేర్కొన్నారు. బుధవారం తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో అగ్రిహబ్ తాండూరు, లైవ్లీహుడ్ బిజినెస్ ఇంక్యుబేటర్ సంయుక్త ఆధ్వర్యంలో రైతులను వ్యాపారవేత్తలుగా అభివృద్ధి కార్యక్రమం-గ్రామీణ వ్యవసాయ రంగంలో నూతన వ్యాపార అవకాశాలకు తోడ్పాటుపై ఎఫ్‌పీఓ డైరెక్టర్‌లతో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. గ్రామీణ ఆధారిత వ్యాపారాలను ప్రారంభించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రైతులు ఆత్మ విశ్వాసంతో వ్యాపారాన్ని ప్రారంభిస్తే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన వాటిని లైవ్లీహుడ్ బిజినెస్ ఇంక్యుబేటర్ సంస్థ ప్రతినిధులు సహకారం అందిస్తారన్నారు. పరిశోధన స్థానం హెడ్ సుధారాణి మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు ప్రవేశపెట్టిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, యువత సద్వినియోగం చేసుకొని వ్యాపారంలో రాణించాలన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన వాటిని ప్యాకేజింగ్, బ్రాండింగ్, డిజిటల్ మార్కెటింగ్ లాంటి పలు అంశాలపై టీఆర్‌వీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు భారతి, యమున, స్వాతి, ఎఫ్‌పీఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు

అనంతగిరి: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, డిసేబుల్, మైనార్టీ విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఉపకార వేతనాలు, బోధన ఫీజులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి కమలాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అందుకుగాను ఈనెల ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఆన్‌లైన్‌లో ఈపాస్ పోర్టల్ వెబ్‌సైట్‌లో సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9948663053లో సంప్రదించాలన్నారు.

తాండూరు ఏపీఎం ఆనంద్ బదిలీ

తాండూరు రూరల్: మండలం సెర్ప్ విభాగంలో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్(ఏపీఎం) ఆనంద్ బుధవారం బదిలీ అయ్యారు. ఆరేళ్లుగా ఆయన మండలంలో పని చేశారు. జిల్లాల్లోని ఆయా మండలంలోని ఏపీఏంలను ప్రభుత్వం బదిలీ చేసింది. ఇందులో భాగంగా ఆనంద్‌ను తాండూరు నుంచి బంట్వారానికి బదిలీ చేశారు. దోమ ఏపీఎం సురేష్‌ను తాండూరు మండలం ఏపీఏంగా రానున్నారు. బదిలీ అయిన ఏపీఎంలకు ఆగస్టు ఒకటవ తేదీన రిలీవ్ చేయనున్నట్లు తెలిసింది.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



చిత్తాపూర్‌లో ధ్వంసం చేసిన కడీలను చూపిస్తున్న రైతులు

మంచాల: తమ భూమిలోకి అక్రమంగా చొరబడి కడీలు విరగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని తాళ్లపల్లిగూడ రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోలమోని ఆశయ్య, పోలమోని భిక్షపతి, పొలమోని ప్రభు, కోయిగూర సుధాకర్, కోయిగూర భాస్కర్, కోయిగూర కరుణాకర్‌లకు సంబంధించి సర్వే నంబర్ 79లో 0-25 గుంటల భూమి ఉంది. తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూమిని చిత్తాపూర్ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమిస్తున్నారని సదరు రైతులు ఆరోపించారు. మంగళవారం రాత్రి పొలంలో నాటిన కడీలను విరగొట్టారని, అక్కడే ఏర్పాటు చేసిన సీసీ కెమెరాను ధ్వంసం చేశారని ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై సీఐ మధును వివరణ కోరగా.. పూర్తి స్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కటకటాలకు పాత నేరస్తుడు

మూడు నెలల క్రితం చోరీకి పాల్పడిన దొంగను పట్టుకున్న పోలీసులు



నిందితుడు మురళి

మొయినాబాద్: పలు ప్రాంతాల్లో వరుసగా చోరీలు చేస్తూ మూడు నెలల క్రితం మండలంలోని పెద్ద మంగళారంలో తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగను మొయినాబాద్ పోలీసులు పట్టుకున్నారు. దోచుకున్న సొత్తును స్వాధీనం చేసుకుని కటకటాల్లోకి పంపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్ గ్రామానికి చెందిన తిమ్మగళ్ల మురళి అలియాస్ ముత్యాలు అత్తాపూర్‌లో ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. మే నెల 5న రాత్రి 10 గంటల సమయంలో బస్సులో మొయినాబాద్‌కు వచ్చాడు. క్వాటర్ బాటిల్ మద్యం కొనుక్కుని ఒక్కడే కూర్చొని తాగాడు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో పెద్దమంగళారం గ్రామానికి వెళ్లి తాళం వేసి ఉన్న ఇంటిని టార్గెట్ చేశాడు. తనతో తెచ్చుకున్న ఇనుపరాడ్డుతో తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడ్డాడు. బీరువాలోని 26 తులాల బంగారం, రూ.2.50 లక్షల నగదు దోచుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలు పెట్టిన పోలీసులు సుమారు మూడు నెలలకు బుధవారం దొంగను పట్టుకున్నారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా గత మార్చి నుంచి మైలార్‌దేవ్‌పల్లి, చేవెళ్ల, మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మరో ఆరు దొంగతనాలు చేసినట్లు అంగీకరించాడు. దొంగిలించిన సొత్తును అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

27 దొంగతనం కేసులు

పెద్దమంగళారంలో దొంగతనం చేసి పట్టుపడిన మురళి పాత నేరస్తుడు. అతనిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 27 దొంగతనం కేసులున్నాయి. మురళి ఖర్చుల కోసం దొంగతనాలు చేయడం అలవాటుగా మార్చుకున్నాడు. దొంగతనానికి వెళ్లే ముందు ఒక్కడే మద్యం తాగి వెళ్తాడు. తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని తన వెంట తెచ్చుకునే ఇనుపరాడ్డుతో తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతారు. దొంగిలించిన ఆభరణాలను విక్రయించి డబ్బులను ఖర్చులకు వాడుకుంటాడు. ఇలా సైబరాబాద్, వరంగల్, సంగారెడ్డి, కడప, కర్నూలు జిల్లాలో దొంగతనాలు చేసి చాలాసార్లు జైలుకు వెళ్లి వచ్చాడు.

డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

పరిగి: డీసీఎం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణ కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నవాబ్‌పేట మండల కేంద్రానికి చెందిన కుమ్మరిగూడ శ్రీనివాస్(35) పని నిమిత్తం పరిగికి వచ్చాడు. పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ముందు వెళ్తుండగా వెనుకనుంచి డీసీఎం అతివేగంగా వచ్చి ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని డీసీఎంను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బైక్ నంబర్ ఆధారంగా మృతుడి ఆచూకీ తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

13 ఏళ్ల బాలికకు వివాహం

- నలుగురిపై కేసు నమోదు
- చిన్నారిని సఖి సెంటర్‌కు తరలింపు

నందిగామ: అభం శుభం తెలియని 13 ఏళ్ల బాలికకు వివాహం చేసిన ఘటనలో పెళ్లి కొడుకు, బాలిక తల్లితో పాటు మరో ఇద్దరు వ్యక్తులపై నందిగామ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం.. నందిగామకు చెందిన 13 ఏళ్ల బాలిక స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఆమెకు చేవెళ్ల మండలం కందవాడకు చెందిన శ్రీనివాస్‌గౌడ్(40)తో గత మే నెల 28న నందిగామ శివారులోని ఓ ఆలయంలో పెళ్లి చేశారు. అప్పటి నుంచి బాలిక నందిగామలో తల్లి వద్దే ఉంటోంది. పెళ్లి చేసుకోవడం ఏమాత్రం ఇష్టం లేని బాలిక ఇటీవల పాఠశాలకు వెళ్లి జరిగిన విషయాన్ని ఉపాధ్యాయులకు తెలిపింది. దీనిపై స్పందించిన హెచ్‌ఎం సుధాకర్ అధికారులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన తహసీల్దార్ రాజేశ్వర్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ బాలిక కుటుంబ సభ్యులను పీఎస్‌కు పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలికకు పెళ్లి చేయడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. పెళ్లి కొడుకు శ్రీనివాస్‌గౌడ్, బాలిక తల్లి స్రవంతి, మధ్యవర్తి పెంటయ్య, పురోహితుడు ఆంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ అధికారుల సహకారంతో బాలికను సఖి కేంద్రానికి తరలించినట్లు పోలీసులు వివరించారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ దుర్మరణం



ట్రాక్టర్ కింద ఆంజనేయులు మృతదేహం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడటంతో డ్రైవర్ దుర్మరణం చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైరపాట ఆంజనేయులు(30) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా బుధవారం లింగధన గ్రామం నుంచి ట్రాక్టర్‌తో జూలపల్లి వస్తుండగా గ్రామ శివారులో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

అంత్యక్రియలకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

భార్యాభర్తలకు తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన దంపతులు

కొత్తూరు: బంధువుల అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళ్తూ ఓ దంపతులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంఘటన కొత్తూరు పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెంజర్ల గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డి, తన భార్య పద్మతో కలిసి బైక్‌పై కాటేదన్‌లో తమ బంధువుల అంత్యక్రియలకు ఉదయం బయలుదేరారు. కాగా పెంజర్ల కూడలిలో రోడ్డును దాటే క్రమంలో ప్యాసింజర్ జీపు ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుంటుంబ సభ్యులు చికిత్స నిమ్మితం శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

జిల్లా మహాసభలకు తరలిరండి

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

శంకర్‌పల్లి: మొయినాబాద్‌లో ఆగస్టు 2న నిర్వహించే సీపీఐ 17వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి పిలుపునిచ్చారు. బుధవారం శంకర్‌పల్లిలో సీపీఐ మండలాధ్యక్షుడు సు. దీర్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. రామస్వామి మాట్లాడుతూ.. 17వ జిల్లా మహాసభలకు రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరు అవుతున్నారని, గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావాలని కోరారు. అదే విధంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధం కావాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకొని వెళ్లాలని సూచించారు. సమావేశంలో నాయకులు గోపాల్‌రెడ్డి, అహ్మద్, రవీందర్, మల్లయ్య, సువర్ణ, యాదయ్య, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం



సమావేశంలో మాట్లాడుతున్న సదానందం

మండల ప్రత్యేకాధికారి సదానందం

మోమిన్‌పేట: మానవ అక్రమ రవాణా తీవ్రమైన నేరమని మండల ప్రత్యేకాధికారి సదానందం పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా చేయడం తీవ్రమైన నేరంగా పరిగణిస్తారన్నారు. అలాంటి పనులు చేస్తున్న వారిని ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేది లేదన్నారు. ముఖ్యంగా విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రయాణం చేసే సమయంలో అపరిచితులు ఇచ్చే ఆహార పదార్థాలను తీసుకోకూడదన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఒకసారి అలవాటు పడితే భవిష్యత్తు అంధకారమే అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ఎప్పటికప్పుడు పర్యవేక్షణ అవసరమని నొక్కి చెప్పారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే 1098కి కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ మల్లేశం, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం అధికారి అలీమొద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బదిలీపై వెళ్తున్న సీఐ రాఘవేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆదిబట్ల పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ నూతన సీఐగా రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిన్నటి వరకు ఇక్కడ సీఐగా పని చేసిన రాఘవేందర్‌రెడ్డి బదిలీపై పహాడీషరీఫ్ ఠాణాకు వెళ్లారు. సీఐగా రవికుమార్‌కు రాఘవేందర్‌రెడ్డి బాధ్యతలు అప్పగించారు. అనంతరం సీఐ రాఘవేందర్‌రెడ్డికి ఆదిబట్ల పోలీసులు గజమాలతో సత్కరించారు. నూతనంగా విచ్చేసిన సీఐ రవికుమార్ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ తోడ్పాటు నందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వెంకటేష్, సైదులు, నోయల్‌రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి



యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పీఎస్ సీఐగా సత్యనారాయణ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పీఎస్ పరిధిలో శాంతి భద్రతల కోసం కృషి చేస్తానని, ప్రజలు కూడా సహకరించాలని నూతనంగా బాధ్యతల చేపట్టిన సీఐ అన్నారు.

స్థానిక పోరులో సత్తా చాటుతాం



మద్ది కరుణాకర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

మహేశ్వరం: రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, తుమ్మలూరు మాజీ సర్పంచ్ మద్ది కరుణాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయన గృహానికి చేరుకొని కేక్‌ను కట్ చేయించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్ఆర్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిలతో పాటు పలువురు నేతలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుమ్మలూరు గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేసి కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్ది సురేఖారెడ్డి, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, యాదగిరిగౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఉపాధ్యాయులు

తపస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కాశీరావు

శంకర్‌పల్లి: రాష్ట్రంలో నెలకొన్న ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశీరావు అన్నారు. బుధవారం మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం కొత్త పెన్షన్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానం తీసుకొని రావాలని, జీవో 317లో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. పెండింగ్ బిల్లులు, డీఏల పెంపు, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయలుకు పే స్కేల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు జంగయ్య, శ్రీను, బస్వరాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.